క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

బొల్లాపల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మన్నేపల్లిపాడు తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన మూడావత్ రామునాయక్(38) భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా ప్రాంతానికి చేరుకొని పోలీసులు విచారణ చేశారు. మృతుడికి భార్య బుజ్జిబాయి, ముగ్గురు సంతానం ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలతో భార్య వినుకొండ పట్టణంలో నివాసం ఉంటుంది. ఇటీవల భర్తపై వినుకొండ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుడి తల్లి రాంకీబాయి ఫిర్యాదు మేరకు బండ్లమోటు ఎస్ఐ డి. చెన్నకేశవులు కేసు నమోదు చేశారు.

జిల్లా టైలర్స్ కార్యవర్గంలో పలువురికి స్థానం

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా టైలర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం పిడుగురాళ్లలో ఆదివారం నిర్వహించారు. జిల్లా కమిటీలో వినుకొండ నుంచి కోశాధికారిగా ఎండీ ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ గోవిందరాజులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాశీ వెంకటాచారి, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కే సైదాలు ప్రమాణస్వీకారం చేశారు.

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి



వినుకొండ(నూజెండ్ల): విద్యార్థులు శ్రద్ధతో చదవాలని పట్టణ సీఐ సాంబశివరావు పేర్కొన్నారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుక ఆదివారం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.లింగారావు, బొడ్డపాటి వరప్రసాద్, పుల్లారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మక్కెన రాజీనామా

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో కేజీఎల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన



వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: రాష్ట్రాభివృద్ధికి, ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని నల్లగార్లపాడులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.2.60 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. త్వరలో కళ్యాణ మండపాన్ని కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. హెల్త్ సెంటర్ అందుబాటులోకి రావటంతో గ్రామస్తులు ఇక నుంచి రెడ్డిపాలెం పీహెచ్‌సీకి, నరసరావుపేటకు వెళ్లే అవసరం ఉండదని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి, డి.అంజిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, బాలిరెడ్డి, న్యాయవాది రమణారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, కామినేని వెంకయ్య, చపారపు సంజీవరెడ్డి, కాశినేడి మస్తానయ్య, తెలగనేని వెంకటేశ్వరరావు, బీరం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా..

నరసరావుపేట: రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారంతో ముగిసిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడల్లో వాలీబాల్ పురుషుల విభాగంలో జిల్లా విజేతగా నిల్చిన నరసరావుపేట నియోజకవర్గ టీము క్రీడాకారులు ఆదివారం పార్టీ కార్యాలయంలో సాధించిన కప్‌తో ఎమ్మెల్యేను కలిశారు. వారందరినీ ఎమ్మెల్యే గోపిరెడ్డి అభినందించి మాట్లాడారు. యువకుల్లో ఉన్న ప్రావీణ్యతను బయటకు తీసేందుకు ప్రభుత్వం ఈ క్రీడలను నిర్వహిస్తుందన్నారు. నియోజకవర్గానికి చెందిన టీములు వాలీబాల్‌తో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్‌లలో విజేతలుగా నిలవటం గర్వకారణమన్నారు. విశాఖ పట్టణంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి పల్నాడు జిల్లాకు, నరసరావుపేటకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చిలకలూరిపేటటౌన్: పేదవారి ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ భరోసా కల్పిస్తున్నారని కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో ఐదుగురికి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ. 5.05 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వీరిలో అత్యధికంగా పట్టణంలోని మద్దినగర్‌కు షేక్ షాలిమున్నిసాకు రూ.3 లక్షల చెక్కు అందుకున్నారు.

శావల్యాపురం ఖోఖో జట్టుకు ద్వితీయ స్థానం



శావల్యాపురం: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి ఖోఖోలో శావల్యాపురం జట్టు ద్వితీయస్థానం సాధించింది. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ విజేతలకు ట్రోఫీ అందజేశారు. ఇటీవల నరసరావుపేటలో నిర్వహించిన పోటీల్లో బహుమతి సాధించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు ఈనెల 9వ తేదీ నుంచి 13 వరకు విశాఖలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

మతుకుమల్లిలో పశువైద్యశిబిరం

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో పశువైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. పశువులకు గాలికుంటు టీకాలు అందజేశారు. మండలం పశువైద్యాధికారి సోముల గుణదీప్ సేవలందించారు.

ఈత పోటీల్లో ప్రతిభ

సత్తెనపల్లి: ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతి కరకట్ట ఉండవల్లి సమీపంలోని లైలాగంగరాజు నగర్ లో ఆదివారం నిర్వహించిన 24వ కృష్ణ రివర్ క్రాస్ ఈత పోటీల్లో సత్తెనపల్లికి చెందిన నిమ్మగడ్డ హనుమంతురావు ప్రతిభ కనబరిచారు. 61 సంవత్సరాల విభాగంలో 1.5 కిలో మీటర్ల ఈత పోటీల్లో 48 మంది పోటీపడగా సత్తెనపల్లికి చెందిన హనుమంతరావు ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే 40నుంచి50 సంవత్సరాల విభాగంలో 1.5 కిలోమీటర్లు నిర్వహించిన ఈత పోటీలో 86 మంది పాల్గొనగా సత్తెనపల్లికి చెందిన షేక్ మహమ్మద్ గని, డాక్టర్ శ్రీధర్, షేక్ మహబూబ్ సైదా నిర్ణీత సమయానికి చేరుకున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సత్కరిస్తున్న మహిళా సంఘాల నాయకులు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): మహిళల ఆర్థికాభివృద్ధి చెందాలనేదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉద్దేశమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక బొల్లా బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలో స్వయం సహాయక సంఘాలకు 4వ విడత ఆసరా చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అక్కాచెల్లెమ్మల ఖాతాల్లో రూ.3.89కోట్లకు పైగా జమ చేసినట్లు వివరించారు. నవరత్న పథకాల ద్వారా ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమం అనంతరం వినుకొండలో గతంలో ఆక్రమణలకు గురైన ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని అర్హులైన 136 మందికి లబ్ధిదారులకు పట్టాలను ఇస్తున్నామని తెలిపారు. వినుకొండలో సరైన వైద్యశాల లేక మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట, గుంటూరు లాంటి పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని, ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వినుకొండలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడంతో పాటు నిధులు కూడా విడుదల చేశారన్నారు.

కబడ్డీ విజేతలకు అభినందనలు

వినుకొండ(నూజెండ్ల): దేశంలోనే మొట్టమొదటిసారి ఆటల పండుగ తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

పది కిలోల గంజాయి స్వాధీనం



నాదెండ్ల: శ్రీకాకుళం జిల్లా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి కథనం.. గణపవరం చవిటిపాలెం వెళ్లే డొంక రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై పది కిలోల గంజాయి తరలిస్తుండగా ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరు ఖైరతాబాద్ చింతలబస్తీకి చెందిన కడం ఉల్లాస్, ఒడిషా రాష్ట్రానికి చెందిన గొలరి శంకర్, విశాఖ జిల్లా సీలేరుకు చెందిన రెడ్డి గుణశేఖర్‌గా గుర్తించారు. గత నెల 31వ తేదీన చింతలపుట్టి శివకుమార్, కె.శంకర్ రెండు ద్విచక్రవాహనాలపై గంజాయిని తరలిస్తూ తిమ్మాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి పోలీసులకు చిక్కారు. ఇద్దరి వద్ద నుంచి 107.845 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఇరువురు నిందితుల సమాచారం ఆధారంగా తనిఖీ నిర్వహించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసిన వారిలో యడ్లపాడు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్, రూరల్ ఎస్ఐ రవికృష్ణ, ఏఎస్ఐ రోశిబాబు, నాదెండ్ల డీటీ అనూరాధ, ఆర్ఐ రమీజా, వీఆర్వో వీరయ్య ఉన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి తిరునాళ్ల

శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



శిడిమాను ఊరేగింపులో పాల్గొన్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట/యడ్లపాడు: గ్రామదేవత అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పురుషోత్తమపట్నంలోని అంకమ్మతల్లి ఆలయం వార్షికోత్సవానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిడిమాను ఊరేగింపును రాజేష్‌నాయుడు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు రాజేష్‌నాయుడిని పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వానించారు. అశేష భక్తజనం నడుమ పార్టీ శ్రేణులతో కలిసి రాజేష్‌నాయుడు ఆలయ ప్రదక్షిణలు చేసి, భక్తిశ్రద్ధలతో దేవతామూర్తులకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం జరిగిన పూజల్లో పాల్గొని పండితుల ఆశీస్సులు అందుకున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను గ్రామస్తులతో కలసి తిలకించారు. అక్కడ నుంచి గ్రామంలోని బొడ్డురాయి, వినాయక దేవాలయం, శివాలయం, గంగమ్మ తల్లి దేవాలయాల వద్ద రాజేష్‌గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిలకలూరిపేటటౌన్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్ కోరారు. పట్టణంలోని 13,14 వార్డుల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మాజీ కౌన్సిలర్లు వార్డుల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, 10 వార్డు కౌన్సిలర్ బేరింగ్‌మౌలాలి, కో ఆప్షన్ సభ్యులు పోలిశెట్టి మస్తాన్‌రావు, పట్టణ మాజీ అధ్యక్షుడు ఏపీఎం సుభాని పాల్గొన్నారు.

కనపర్రు సేవా సమితి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు

నాదెండ్ల: కావూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, రక్తపరీక్షల నమూనాలు సేకరించారు. ఉచితంగా మందులు అందించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆదివారం కనపర్రు గ్రామానికి చెందిన కనపర్రు సేవా సమితి ఆధ్వర్యంలో విష జ్వరాలు అరికట్టేందుకు యువత సేవా కార్యక్రమాలు నిర్వహించింది.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రొంపిచర్ల: పూర్వ విద్యార్థులు సందడి చేశారు. స్మృతులను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న తరగతిలో అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అందుకు మండలంలో సంతగుడిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. ఆదివారం 1979-80లో పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 45 సంవత్సరాల తరువాత కలుసుకొన్న పూర్వ విద్యార్థులు ఆనాడు పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరవేసుకొని సరదగా, ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి తాము ఈ స్థాయికి రావడానికి కారకులైన ఆనాటి ఉపాధ్యాయులు కురుగంటి పిచ్చిరెడ్డి, కె.వి. శివయ్య, కళ్ల కృష్ణారెడ్డి, ఎస్.రాధాకృష్ణమూర్తి, ఎస్.కె. మహబూబ్, కె.వీర రాఘవయ్య లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పొలిమేర వెంకటరెడ్డి, ఎస్.కె.మొహిద్దీన్ సాహెబ్, నల్లబోతు శివశంకర్, ఆదినారాయణ, వెంకటప్పయ్య, మామిళ్ళపల్లి అప్పారావు పర్యవేక్షించారు.